
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి
5
శనివారం 13 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.158	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.2

వేలాది మంది కార్యకర్తలు. వందలాది వాహనాలతో ర్యాలీలు, ప్రదర్శనలకు వేళయింది. అంగ, అర్థ బల నిరూపణ చేసుకునేందుకు సమయం ఆసన్నమైంది. పార్టీల అగ్రనేతలు, లేదంటే జాతీయ, రాష్ట్రస్థాయి నేతలను తీసుకొచ్చి నామినేషన్లు వేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలకు ఆయా పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా, నామినేషన్ల తేదీ దగ్గరపడుతుండడంతో అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టానికి మంచి ముహూర్తం కోసం వేదపండితులను ఆశ్రయిస్తున్నారు.

-(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



ముహూర్తం ఖరారు

- 18వ తేదీ నుంచి నామినేషన్లకు సిద్ధమవుతోన్న అభ్యర్థులు
- శుభ ఘడియలు అయిదు రోజులే అంటున్న పండితులు
- ఆ రోజుల్లోనే నామినేషన్ల దాఖలుకు సన్నాహాలు
- నామినేషన్లకు పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యేలా కసరత్తు
- కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు తేదీలు ఖరారు

లోక్‌సభ ఎన్నికల కీలకఘట్టానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంటే, అదే రోజు నుంచి నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం కొనసాగుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి 25వరకు మాత్రమే నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉండడంతో శుభముహూర్తాలు, పేరుబలాలు చూసుకొని నేతలు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులను ఆశ్రయిస్తూ అనువైన తేదీలను తెలుసుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు నామినేషన్ రోజే తమ సత్తా చాటేలా భారీ ర్యాలీలు, కీలకనేతల ఆధ్వర్యంలో బహిరంగసభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ఘట్టానికి తెరలేవనుండడంతో లోకసభ సమరం వేడెక్కనుంది.

18 నుంచి నామినేషన్ల దాఖలు

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 25వరకు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఎనిమిది రోజుల్లో తమ పేరు బలం, పార్టీ బలం, జన్మనక్షత్రాల ప్రకారం ఏరోజు నామినేషన్ వేస్తే సత్ఫలితాలుంటాయని కోరుతూ అభ్యర్థులు వేదపండితులను ఆశ్రయిస్తున్నారు. పండితుల సూచనల ప్రకారం, మరోవైపు పార్టీ అధిష్టానాల నుంచి వస్తోన్న ఆదేశాల మేరకు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు. వేదపండితులు పేర్కొంటున్న ప్రకారం 19, 23, 25వ తేదీలు తిథి, నక్షత్రాల ప్రకారం శుభగడియలు కావని, ఆ రోజుల్లో నామినేషన్లు వేయడం సబబు కాదని చెబుతుండడంతో ఆ రోజుల్లో నామినేషన్లుండే అవకాశం లేదు. 18, 20, 21, 22, 24 తేదీల్లో శుభఘడియలుండడంతో ఈ తేదీల్లో అభ్యర్థుల జాతకాల ప్రకారం అత్యంత శుభదినం ఉన్నరోజు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నామినేషన్లకు అభ్యర్థులు సిద్ధం

కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 21న, సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ 19న, నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 24న నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు. వీరి నామినేషన్ల కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు పార్టీ జాతీయనేతలు హాజరవుతారని చెబుతున్నారు. వీలైతే నామినేషన్ల దాఖలు రోజు పార్లమెంట్ నియోజకవర్గకేంద్రాల్లో బహిరంగసభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. అయితే మే మొదటివారం లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పర్యటన ఖరారైతే బహిరంగసభల తేదీలను మార్చే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు నల్లగొండ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న శానంపూడి సైదిరెడ్డి కూడా 22 లేక 24న నామినేషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈయన నామినేషన్ రోజునే నల్లగొండలో భారీ బహిరంగసభ నిర్వహించి, బీజేపీ దిగ్గజనేత, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలైని తీసుకురావాలని యోచిస్తున్నారు. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ నామినేషన్‌కు సైతం కీలక జాతీయనేతను ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామమల్లేశ్ నామినేషన్ల కార్యక్రమాలకు కేటీఆర్ రానున్నట్లు చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేలా ప్రణాళిక ఖరారు చేస్తున్నట్లు పార్టీనేతలు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కేంద్రాల నిర్వాహకులు, మార్కెట్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రతీ సంవత్సరం వేలాది రూపాయల కమీషన్ పొందుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచకుండా వ్యవసాయ మార్కెట్లపైనే ఆధారపడుతున్నారు.

- మోత్కూరు, గుండాల



గుండాల మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో కిరాయి యంత్రంతో ధాన్యం పడుతున్న రైతులు

కమీషన్ నిర్వాహకులకు.. ఖర్చు రైతులకు

- పాత పద్ధతుల్లోనే ప్యాడీ క్లీనింగ్
- సాంకేతికత పెరిగినా.. మారని తీరు
- కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో లేని ప్యాడీ క్లీనర్లు
- అధునాతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు

వ్యవసాయ మార్కెట్లు ఇచ్చే టార్పాలిన్లు సరిపోక వర్షాలు కురిస్తే కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఇక ప్యాడీ క్లీనర్ల విషయానికొస్తే తమ వద్ద ఉన్న పాత మోడల్ ప్యాడీ క్లీనర్లను కేంద్రానికి ఒకటి చొప్పున ఇస్తున్నారు. అందులో కొన్ని పని చేస్తుండగా, మరి కొన్ని పని చేయడం లేదంటున్నారు. దీంతో రైతులు ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా..

వ్యవసాయ రంగంలో రైతులకు శ్రమ తగ్గి, పని సులువు అయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఎన్నో రకాల యంత్రాలు తయారు చేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాల్లో ప్యాడీ క్లీనర్ కూడా ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్యాడీ క్లీనర్‌తో ఎక్కువ మంది కూలీలు అవసరం లేకుండా, తక్కువ శ్రమతో తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యం శుభ్రమవుతుంది. ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా వ్యవసాయ మార్కెట్లు కాలం చెల్లిన పాత మోడల్ యంత్రాలనే వాడుతున్నాయి. మార్కెట్లు ఇచ్చిన యంత్రాలు పని చేయకపోతే కేంద్రాల నిర్వాహకులే మరమ్మతు చేయించుకోవాలని చెబుతుండటంతో వారు వాటిని పక్కన పడేశారు. పాత మోడల్ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ఎక్కువ కూలీలు, ఎక్కువ సమయం పడుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద నూతన ప్యాడీ క్లీనర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. మోత్కూరు మండలంలో సదర్శాపురం, దాచారం గ్రామాల ఐకేపీ కేంద్రాలకు మార్కెట్ నుంచి ఇచ్చిన ప్యాడీ క్లీనర్లు పనిచేయక పోవడంతో రైతులు నూతన ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుని ధాన్యం శుభ్రం చేస్తున్నారు. అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం ఐకేపీ కేంద్రంతో ప్యాడీ క్లీనర్ లేక రైతులు ట్రాక్టర్‌కు అమర్చిన ఫ్యాన్ ద్వారా గంటకు రూ.800అద్దె చెల్లించి ధాన్యం శుభ్రం చేసుకుంటున్నారు. ఆధునిక యంత్రాలు వాడుకలోకి వచ్చాక కూడా ప్రభుత్వం పాత కాలం నాటి యంత్రాలనేకొని వ్యవసాయ మార్కెట్లకు అందిస్తుండటంతో అటు ప్రజా ధనం వృథాకావడంతోపాటు ఇటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందించాలంటున్న రైతులు

ఫ్యాన్లకు కాలం చెల్లినట్టుగానే పాత మోడల్ ప్యాడీ క్లీనర్లకు కూడా కాలం చెల్లిందని రైతులంటున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఆధునిక ప్యాడీ క్లీనర్లకు గంటకు రూ.వెయ్యి అద్దె చెలిస్తున్నామని, మార్కెట్ కమిటీలు, ఐకేపీ కేంద్రాలు ఆధునిక ప్యాడీ క్లీనర్లు తెచ్చి ఉచితంగా ఇవ్వకపోయినా గంటకు రూ.ఐదు వందలు అద్దె తీసుకున్నా తమకు లాభమే కదా అంటున్నారు.

ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు



గుండాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ పని చేయడం లేదు. దీంతో ప్రైవేటు ప్యాడీ క్లీనర్‌తో ధాన్యాన్ని పడుతున్నాం. దీంతో మాపై అదనపు భారం పడుతుంది.

- తూనం నరేశ్ రైతు, పాచిల్ల, మం.గుండాల

గంటకు రూ.1000 చెల్లిస్తున్నాను



ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ తుప్పు పట్టిపోయింది. దీంతో ధాన్యం పట్టడానికి ప్యాడీ క్లీనర్ లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్యాడీ క్లీనర్‌ను కిరాయికి తీసుకుని గంటకు రూ.1000 చెల్లించాల్సి వస్తుంది.

- ఉడుగుల ఎల్లయ్య, వెల్మజాల, మం.గుండాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

ప్యాడీ క్లీనర్లు పని చేయని విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తా. త్వరలో ప్యాడీ క్లీనర్లను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తా.

- నాగయ్య, సీఈవో, పీఏసీఎస్, గుండాల

గతేడాది నుంచే మార్కెట్లోకి అధునిక ప్యాడీ క్లీనర్లు



చౌళ్ల రామారంలో ఫ్యాన్‌తో ధాన్యం శుభ్రం చేస్తున్న రైతులు

రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రపర్చేందుకు మొదట్లో ఫ్యాన్లు ఉపయోగించే వారు. ఆ తర్వాత ప్యాడీ క్లీనర్లు (జల్లెడలు) వచ్చాయి. ఈ ప్యాడీ క్లీనర్లతో ధాన్యం శుభ్రం చేయడానికి ముగ్గురు నలుగురు వ్యక్తులు ధాన్యం గంపలతో ఎత్తి జల్లెడపై పోస్తే, మరో ముగ్గురు నలుగురు శుభ్రమై వచ్చిన ధాన్యం ఎత్తివేరేచోట రాశి పోయాల్సి ఉంటుంది. ఇప్పుడు మార్కెట్లో(వాడుకలో)కి వచ్చిన ప్యాడీ క్లీనర్‌తో పైపు ధాన్యం రాశి మధ్యన ఉంచి ఒక వ్యక్తి ధాన్యాన్ని పైపు దగ్గరకు లాగితే చాలు ధాన్యం శుభ్రమై రాశి పడుతుంది. ఈ యంత్రంతో కూలీల అవసరం లేకపోగా శ్రమ తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతోంది. ఆధునిక ప్యాడీ క్లీనర్‌కు గంటకు రూ.1000 అద్దె చెల్లిస్తున్నారు. గంటకు 60 నుంచి 70 బస్తాల ధాన్యం శుభ్రమవుతుంది.

1,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్



మాట్లాడుతున్న బెన్ షాలోమ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: జిల్లాలో 1,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 323 కేంద్రాల్లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 32 కేంద్రాల ద్వారా 168 మంది రైతులనుంచి రూ.29కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు ఉన్నాయని, రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని సూచన చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో రవాణా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, కొనుగోలు అనంతరం రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రైతులు నాణ్యాతా ప్రమాణాలు పాటించాలి

ఏడీఏ పద్మావతి

మోటకొండూరు, ఏప్రిల్ 12: రైతులు కొనుగోలు కేంద్రాల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించి గిట్టుబాటు ధర పొందాలని ఏడీఏ పద్మావతి, మండల వ్యవసాయ అధికారిని సుబ్బురు సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని చందేపల్లి గ్రామంలో ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ముందు ఇంటి వద్ద, లేక కల్లాల వద్ద ఆరబెట్టి, తగిన తేమతో, మట్టిపెళ్లలు లేకుండా నాణ్యత కలిగిన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఏఈవో శివాని, ఎఫ్‌పీవో సెంటర్ ఇంచార్జీ నర్సింహ, రైతులు ఉన్నారు.

పర్యవేక్షణ లోపం

చిన్న సమస్యలే.. ప్రజలకు తప్పని తిప్పలు

అందుబాటులో వందలాదిమంది సిబ్బంది, స్వీయ నిర్ణయంతో లక్షలాది రూపాయలను ఖర్చు చేసే వెసులుబాటు.. అయినా పర్యవేక్షణ లోపం కారణంగా భువనగిరి పట్టణ పరిధిలో పలు సమస్యలు పేరుకుపోతున్నాయి. చూడటానికి చిన్న సమస్యలుగానే ఉన్నప్పటికీ అవి చూపుతున్న దుష్ప్రభావంతో పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్ద సమస్యలను పరిష్కరించనప్పటికీ చిరు సమస్యల పరిష్కారంలో కూడా మునిసిపల్ యంత్రాంగం చూపుతున్న నిర్లక్ష్యంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 35 వార్డుల్లో తక్కువ వ్యయం లేదా మునిసిపల్ కార్మికుల సక్రమ విధులతో పరిష్కారమయ్యే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించగలిగితే పలు ఇబ్బందులు తీరుతాయని ఆయా బస్తీవాసులు అంటున్నారు. పట్టణంలోని చిరు సమస్యల మచ్చుకిలా..

- భువనగిరి టౌన్



వ్యర్థాలు,పిచ్చి మొక్కలతో నిండిన గాంధీనగర్ మురికి కాల్వ

నిర్వహణ కొరవడిన ప్రధాన మురికి కాల్వ..

పట్టణంలోని ప్రధాన మురికి కాల్వ నిర్వాహణ లోపంతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బస్టాండ్ నుంచి జంఖానాగూడ చౌరస్తావరకు గాంధీనగర్ ప్రధాన మురికి, వరదనీటి కాల్వ నిర్వాహణ లోపంతో వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఫలితంగా మురికి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతూ పరిసర ప్రాంతాల్లో దోమలు, పందుల స్వైర విహారం పెరిగింది. దుర్గంధం వ్యాపిస్తోంది. గంజ్ ప్రాంతంలోని మురికి, వరదనీరు పట్టణ మురికి నీటి రిజర్వాయర్‌గా పేర్కొంటున్న తీనం చెరువుకు చేర్చే ప్రధాన మురికి కాల్వ దుస్థితి ఇలా ఉంటే బస్తీ కాల్వల నిర్వహన తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మురికి కాల్వ స్లాబ్

జనావాసాల మధ్య ఉన్న మురికి కాల్వలలను స్థానికులు దాటేందుకు అనువుగా రోడ్డు హద్దుగా వాటిపై స్లాబులు నిర్మించి నిర్వహించాల్సిన బాధ్యత మునిసిపాల్టీది. కానీ నాసిరకం నిర్మాణాలకు తోడు పలు కారణాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురికి కాల్వల స్లాబులు కూలిపోయి రాకపోకలకు అవాంతరంగా మారాయి. పైగా తేలిన సీకులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పోచమ్మవాడతో పాటు పలు ప్రాంతాల్లో కూలిన స్లాబులకు మరమ్మతులు చేపట్టడంలో మునిసిపాల్టీ చూపుతున్న నిర్లక్ష్యం స్థానికుల పాలిట శాపంగా మారుతోంది.



పోచమ్మవాడలో కూలిన మురుగు కాల్వ స్లాబ్

ప్రమాదాలకు నెలవుగా..



జిల్లా ఆసుపత్రి ఎదుట కూలిన ప్రధాన రహదారి డివైడర్

పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనులలో భాగంగా ఆరేళ్ళ క్రితం బొమ్మాయి పల్లి క్రాస్ రోడ్స్ నుంచి పాత బస్టాండ్ వరకు మూడు ఫీట్ల వెడల్పుతో సుమారు నాలుగు కిలోమీటర్ల పాటు డివైడర్‌ను నిర్మించారు. పట్టణ సుందరీకరణ కోసం డివైడర్ మధ్యలో మొక్కలను పెంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ డివైడర్ నిర్వహణను మాత్రం విస్మరిస్తున్నారు. జిల్లా ఆసుపత్రి ఎదుటగా సుమారు ఏడాది క్రితం ధ్వంసమైన డివైడర్‌కు మరమ్మతులు చేపట్టలేదు. ఇక్కడనే యూ టర్న్ ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు మలుపు తీసుకుంటుటాయి. అయితే పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ధ్వంసమైన డివైడర్ మొనతేలిన రాళ్లపై పడుతూ గాయాల పాలవుతుండటం నిత్య కృత్యం అవుతోంది.

పశువులకు మేతగా వ్యర్థాలు



కిసాన్ నగర్‌లోని రహదారి పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తింటున్న పశువులు

మెజార్టీ పట్టణ వాసులను తెల్లవారి నిద్ర లేపుతున్నది చెత్త సేకరణ సిబ్బందే. కానీ కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగక పోతుండటంతో ప్రజలు ఇళ్లలో ఉత్పత్తి అవుతున్న చెత్తను రోడ్డు పక్కనే పారవేస్తున్నారు. అలాగే వాహనాలు వెళ్లలేని ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను, మురికి కాల్వలను శుభ్రం చేయడం ద్వారా పోగైన చెత్తను మరికొద్ది మంది కార్మికులు ఆయా ప్రాంతాల్లో నిర్దేశిత ప్రాంతాలలో కుప్పగా పోగు చేస్తారు. ఆ చెత్త కుప్పలను ట్రాక్టర్ల ద్వార కంపోస్టు యార్డ్‌కు తరలిస్తారు. కానీ ఈ విధానంలో ఏర్పడుతున్న అంతరాయాలతో బస్తీ చెత్తకుప్పలు పశువులకు, వీధి కుక్కలకు అడ్డాగా మారి మరిన్ని పారిశుధ్య సమస్యలకు కారణమవుతోంది.

విహార యాత్రలతో విజ్ఞానం



హైదరాబాద్‌లో విద్యార్థినులు

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 12: విహార, విజ్ఞాన యాత్రలతో విద్యార్థినులకు విజ్ఞానం తో పాటు సామాజిక అవగాహన పెంపొందుతుందని చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ కె.సరోజనమ్మ అన్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా గురుకుల విద్యాలయానికి చెందిన 400 మంది విద్యార్థినులకు కేటాయించిన ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్, సచివాలయం, అమరవీరుల స్తూపం, బిర్లా మందిరం, బిర్లా ప్లానిటోరియం, మదర్ డైరీ తదితర ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు శుభవార్త

7

- 'చేనేతన్నకు భరోసా' పథకం అమలుకు కసరత్తు
- ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలో 'నేతన్న భరోసా' కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి రూరల్, ఏప్రిల్ 12: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశమై ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌కు ఏర్పాటు చేయాలని నూతన ఓటరు జాబితాతో వివరాలు అందించాలన్నారు. నామినేషన్‌కు సంబంధించిన అన్ని ఫాంలపై హెల్ప్‌డెస్క్‌లో అభ్యర్థులకు సహాయం అందించాలని, పోటీచేసే అభ్యర్థి, బలపరిచే వారికి ఓటు హక్కు ఉన్నది లేనిది పరిశీలించడం, నామినేషన్ పత్రాలు నింపడం, జత చేసే పత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. చెక్ పోస్టులను తరుచూ పరిశీలిస్తూ టీములు, షిఫ్టులవారీగా డ్యూటీలు తనిఖీ చేయాలని, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సభలు, సమావేశాలకు, ర్యాలీలకు సంబంధించి సువిధ ద్వారా ఎన్ని అనుమతులు ఇచ్చారు. ఇచ్చిన వాటి వివరాలను సరైన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పార్లమెంట్ అభ్యర్థికి రూ.95లక్షలలోపు ఖర్చు నిబంధన ఉందని, మొదట వచ్చిన వారికి మొదటిగా అనుమతివ్వాలని సూచించారు. 85 ఏళ్ల వయస్సు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం పారదర్శకంగా నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. అనంతరం భువనగిరి శివారులో అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జనగాం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పింకేశ్ కుమార్, జిల్లా ఉప ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్లు బి బెన్ షాలోమ్, భువనగిరి ఆర్డీవో పరాంకుశం అమరేందర్, ఆలేరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ కె.గంగాధర్, మునుగోడు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.సుబ్రహ్మణ్యం, నకిరేకల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పూర్ణచందర్, తుంగతుర్తి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బీఎస్ లత, జనగామ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.కొమురయ్య, ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.అనంతరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరచారి, ఎన్.అంజిరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.



అరోరా ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

● కొనసాగుతున్న వసంతోత్సవాలు




నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిద్దారు. అమ్మవారి సేవను ఆలయతిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.46,39,078 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సీతారామ వసంతోత్సవాలు

శివాలయంలో శుక్రవారం నాలుగో రోజు శ్రీసీతారామచంద్ర స్వామివారి వసంతోత్సవాలు చేపట్టారు. నిత్యారాధనల అనంతరం మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్తి పారాయణాలతో పాటు అభిషేకం, ఆధ్యాత్మిక పారాయణం, స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శతనామార్చనలు జరిపారు. స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి వేదపండితులు, పురోహితులు వేదమంత్రోచ్చరణల నడుమ మంగళవాయిద్యాలు మారుమోగుతుండగా యాగశాలకు తరలించారు. శైవాగమ రీతిలో హోమం జరిపి ప్రత్యేక పీటపై అధిష్ఠింపజేసి వసంతోత్సవాలు నిర్వహించారు. రాత్రి శివాలయంలో హనుమాన్ మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన నీరాజనం, మంత్ర పుష్పములు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు రామరావు, పూజారి దోర్బల శ్రీధరశర్మ, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టపై సాంస్కృతిక కార్యక్రమాలు



ధార్మిక వేదికపై కాళికాదేవి అవతారవిశేషాల నృత్యప్రదర్శన

యాదగిరిగుట్టపై ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే పర్వదిన, ప్రత్యేక, పండుగ, సెలవు రోజుల్లో భక్తులు తిలకించేందుకు సంగీత, సాహిత్య, ధార్మిక మహాసభలు నిర్వహించాలని ఉగాది పర్వదినం నుంచి ఈవో భాస్కర్‌రావు కొత్తవిధానాన్ని ప్రవేశపెట్టారు. తూర్పురాజగోపురం ఎదురుగా ఈశాన్య దిశలో బంగారు క్యూలైన్ పక్కన తాత్కాలిక పందిరితో నృత్యప్రదర్శన నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనను భక్తులు తిలకించారు.

ఆలయ అధికారులకు మెమోలు జారీ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏఈవో, సూపరింటెండెంట్‌లకు మెమో జారీకి ఈవో భాస్కర్‌రావు ఆదేశించినట్లు సమాచారం. గర్భాలయ ప్రాంగణంలో సుమారు 20 నుంచి 30 మంది భక్తులు ఓ పక్కన కూర్చుని ఉండగా అప్పుడే అక్కడకు చేరుకున్న ఈవో ఆరా తీయగా వారు పెళ్లిపత్రికలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. తక్షణమే ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్‌లను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడ ఉన్న భక్తుల్లో ఒకరు ఇక్కడ కూర్చోవద్దా అని ఈవోతో వాగ్వాదం చేసినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై అధికారులకు మెమోలు జారీ చేయాలని అడ్మినిస్ట్రేషన్ ఏఈవో గట్టు శ్రవణ్‌కుమార్‌ను ఆదేశించగా నేడో, రేపో మెమోలు అందనున్నాయి. ఇదిలా ఉంటే భక్తులను తీసుకువచ్చిన గజ్వేల్లి రఘును కూడా ఈవో మందలించినట్లు ప్రచారం సాగుతోంది.



ఆర్జాలబావి ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడవకుండా రైతు ఇక్కట్లు



నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో వర్షంలో వెళ్తున్న వాహనాలు



వేములపల్లి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నిలిచిన నీరు



నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద వర్షంలో వాహనాల ప్రయాణం



నల్లగొండ పానగల్ బైపాస్ వద్ద మిర్యాలగూడ-నల్లగొండ మార్గంలో నిలిచిన నీరు

వాన.. వాన..

- అక్కడక్కడ చిరుజల్లులు, చల్లబడిన వాతావరణం
- కనగల్‌లో 21.3మి.మీ. వర్షం
- నల్లగొండలో మోస్తరు వాన

నల్లగొండ, ఏప్రిల్ 12 : వేసవితో కొద్దిరోజులుగా ఉక్కపోతతో వాతావరణం శుక్రవారం ఒక్కసారిగా మారింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా, శుక్రవారం సాయంత్రం కురిసిన జల్లులతో చల్లబడింది. నల్లగొండ జిల్లాలో సగటున 39.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. ఇక మండలాల వారీగా పరిశీలిస్తే గుర్రంపోడు, పెద్దవూర, నాంపల్లి, వేములపల్లిలో 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మిగతా అన్ని మండలాల్లో 35డిగ్రీల నుంచి 39.9డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతో కూడిన వాతావరణం కనిపించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సాయంత్రం 6.30గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. వాతావరణశాఖ తెలంగాణలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పడుతున్న వానలతో కొంత మేరకు ప్రజలకు ఉపశమనం చేకూరింది. కనగల్‌లో 21.3మి.మీల వర్షపాతం నమోదైంది. చండూరు, త్రిపురారంలో 0.8మి.మీలు, నాంపల్లి, తిప్పర్తి, దేవరకొండ, గుండ్లపల్లి 0.5 మి.మీల చొప్పున చిరుజల్లులు కురిశాయి. వేములపల్లి మండలంలో సుమారు గంట పాటు వర్షం కురిసింది. నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి సమీపంలోని ఐకేపీ సెంటర్‌లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. టార్పాలిన్‌లు గాలి దుమారానికి కొట్టుకుపోయాయి. ధాన్యం రాశులు తడవకుండా రైతులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరాశులు పూర్తిగా నీళ్లలో మునిగాయి. అదేవిధంగా పానగల్ చౌరస్తాలో మురుగు కాల్వ పొంగిపొర్లి నీరు రహదారిపై నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.





నల్లగొండలో చిరుజల్లులకు చిన్నారుల కేరింతలు, వర్షంలో కవర్‌సాయంతో వెళ్తున్న మహిళ



నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఐకేపీ కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

ఉద్యాన శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఉన్న అరకొర సిబ్బందిపై అదనపు భారం
- ఎన్నికల విధులతో పాటు ప్రత్యేకాధికారులుగా నియామకం
- మూడు విధులు చూసుకోలేక ఒత్తిడిలో అధికారులు

భానుపురి, ఏప్రిల్ 12 : ఉద్యాన పంటల సాగుపై పర్యవేక్షణ కరవైంది. సిబ్బంది కొరతతో అధికారులు దృష్టి సారించలేకపోతున్నారు. రైతుల దృష్టిని ఉద్యాన పంటల వైపు మళ్లించడానికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు కరువయ్యారు. వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వాలు ఓ వైపు చెబుతున్నా రైతులకు సలహాలు ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో రైతుల్లో అవగాహన పెంపొందడం లేదు. వెరిసి జిల్లాలో అనుకున్న స్థాయిలో ఉద్యాన పంటల సాగు పెరగడం లేదు. తక్కువ సిబ్బంది



కోదాడ మండలంలోని ఆయిల్‌పాం సాగును పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నా వీరికి ఎన్నికల విధులతో పాటు గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించడంతో ఉద్యాన పంటలపై పర్యవేక్షణ చేయడానికి సమయం దొరకడం లేదు. అటు పంచాయతీ విధులు, ఇటు ఉద్యాన పంటలపై కార్యక్రమాలతో ఒత్తిడడికి లోనవుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల వరకు ఉద్యాన పంటలు సాగవుతుండగా, అందులో పండ్ల తోటలు 18 వేల ఎకరాలు, మిర్చి 24 వేల ఎకరాలు, కూరగాయలు 1,500 ఎకరాలు, ఆయిల్‌పాం సాగు 4వేల ఎకరాలు, ఇతర పంటలు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో ఉద్యాన శాఖలో ఐదుపోస్టులు ఉండగా ముగ్గురు మాత్రమే అధికారులు ఉన్నారు. మరో ఇద్దరు ఆన్‌డ్యూటీలో నల్లగొండలో పనిచేస్తున్నారు. 2020 సంవత్సరంలోనే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో విధులకు రావడం లేదు. వీరు రెండు మండలాలకు ఒకరి చొప్పున ఉండడంతో ఉద్యాన పంటలను పర్యవేక్షణ, డ్రిప్ ఇరిగేషన్ పనులను పర్యవేక్షించేవారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో మూడేళ్ల నుంచి సూర్యాపేట జిల్లాలో ముగ్గురితోనే నెట్టుకొస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు మాత్రమే అధికారులు ఉన్నారు. పండ్లతోటలు ఎక్కువగా ఉన్న కోదాడ నియోజకవర్గానికి అధికారి లేకపోవడం గమనార్హం. కోదాడకు అధికారి లేకపోవడంతో ఇక్కడి మండలాలను తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్ అధికారులకు కేటాయించారు. సూర్యాపేట అధికారికి ఈ విధులతో పాటు టెక్నికల్ బాధ్యతలను సైతం అప్పగించారు. ఒక్కొక్క ఉద్యానశాఖ అధికారి 6 నుంచి 8మండలాలకు ఒకరు ఉండడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. రైతులకు సరైనా సలహాలు, సూచనలు ఇవ్వలేకపోతున్నారు. ఉద్యానపంటలపై ఆసక్తి ఉన్నా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆ పంటల సాగులో జిల్లా వెనుకబడి ఉందని రైతులు చెబుతున్నారు.

అదనపు బాధ్యతలు

ఉన్నదే ముగ్గురు అధికారులు కాగా వీరికి అదనంగా ఎన్నికల విధులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారి విధులు కేటాయించారు. మూడు డ్యూటీలను చూసుకోవడానికి అధిక భారం పడుతోందని, ఆరోగ్యసమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. వేసవిలో రైతుల పంటలను ఎలా కాపాడుకోవాలని సలహాలు , సూచనలు ఇచ్చే అధికారులు అందుబాటులో లేకుండా పోతున్నారు. వ్యవసాయ శాఖలో కేటాయించిన రైతువేదికల వారీగా, మండలానికి ఒక అధికారిని కేటాయిస్తే ఉద్యాన పంటలు వేసి రైతులు డబుల్ ఆదాయం పొందే అవకాశం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా 157మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రిభువనగిరి జిల్లాలో నలుగురు, సూర్యాపేట జిల్లాలో ముగ్గురు, నల్లగొండలో తొమ్మిది మంది మాత్రమే ఉద్యాన శాఖ అధికారులు ఉన్నారు. నల్లగొండలో సుమారు 75 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, యాద్రాది భువనగిరిలో 17 వేల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సూర్యాపేట జిల్లాలో ఉద్యాన శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఉద్యాన పంటల సాగుపై వేసవి ప్రభావం పడలేదు. రైతులు పంటలను కాపాడుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్ ఇరిగేషన్స్ పెట్టుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది లేరు. అయినప్పటికీ వీలైనంత మేరకు రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

\- టీ నాగయ్య, ఉద్యాన శాఖ అధికారి, సూర్యాపేట

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగ సంఘ నేత మృతి



సోమాచారి (ఫైల్ ఫొటో)

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 12: గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకుడు మృతి చెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కాతోజు సోమాచారి(56) 1104 సంఘ డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. శుక్రవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఖమ్మం నేత్రనిధికి ఆయన కళ్లను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమాచారి మృతికి టీసీ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన ఎనలేని సేవలు చేసిన సోమాచారి మరణం తీరని లోటన్నారు. అశోక్‌నగర్‌లో సోమాచారి భౌతికకాయానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కోడిరెక్క విజయకుమార్, మారం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బాలు, అమర్‌సింగ్, సీతారాములు తదితరులున్నారు. సోమాచారి మరణం సంఘానికి తీరని లోటని విశ్వకర్మ సంఘ నాయకులు పేర్కొన్నారు.

గుండాలలో యువకుడు...



మధుసూదన్‌గౌడ్(ఫైల్)

గుండాల, ఏప్రిల్ 12: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు గూడ మధుసూదన్‌గౌడ్(27) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అర్ధరాత్రి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీని తీసుకుని వెళ్లే సరికి మృతి చెందారు. గుండాల మండలాన్ని జనగాం నుంచి యాదాద్రి జిల్లాలో కలపడం కోసం సాగిన ప్రత్యేక ఉద్యమంలో మధుసూదన్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా సుద్దాల-పల్లెపహాడ్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి పోరాటం చేశారు. మధుసూదన్‌గౌడ్ మృతదేహాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, రాష్ట్ర నాయకులు హరిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్, నాయకులు రవీందర్ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు.

కడుపు నొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య



లావూరి సూక్యా(ఫైల్)

త్రిపురారం, ఏప్రిల్ 12 : కడుపు నొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం గ్రామానికి చెందిన మర్ల చంద్రారెడ్డి వద్ద దామరచర్ల మండలం వాచ్యతండాకు చెందిన లావూరి సూక్యా(62) 15 ఏళ్లుగా జీతానికి పనిచేస్తున్నాడు. అతను గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా తగ్గలేదు. కుటుంబసభ్యులు అందరూ నిద్రిస్తుండగా ఈ నెల 11న రాత్రి సూక్యాకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. నొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకున్నాడు. సూక్యాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

రూ.3.48 లక్షల నగదు స్వాధీనం

కోదాడ రూరల్/ చిట్యాల రూరల్ / చండూరు, ఏప్రిల్ 12 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో రూ.3.48 లక్షలు పట్టుబడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో శుక్రవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో ఎలా ంటి ఆధారాలు లేని రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వట్టిమర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఆధారాలు లేని రూ.68వేలను పట్టుకున్నారు. చండూరు పట్టణ శివారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.30 లక్షల నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

25 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పోటీలు

మఠంపల్లి, ఏప్రిల్ 12: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.1.50లక్షలు నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆరు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.50వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. నాలుగు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30వేల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు శుభోదయ యువజన సంఘం సెల్ 9618764924 నెంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీలలితాదేవి అలంకరణలో ఎల్లమ్మ తల్లి

కనగల్, ఏప్రిల్ 10 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకాఎల్లమ్మ అమ్మవారు శుక్రవారం భక్తులకు శ్రీలలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తప్పిన ప్రమాదం

మునుగోడు, ఏప్రిల్ 12 : మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లోడింగ్ చేసిన ధాన్యాన్ని స్థానికంగా ఉన్న పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో దిగుమతి కోసం శుక్రవారం మధ్యాహ్నం లారీ బయలుదేరింది. మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి వైపు ఉన్న వంతెన సమీపంలో లారీ వెనుకభాగం నుంచి ధాన్యం బస్తాలు ఒక్కసారిగా కూలీ నడిరోడ్డుపై పడ్డాయి. డ్రైవర్ అప్రమత్తతతో వెంటనే లారీని నిలిపాడు. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారిలో ఆ సమయంలో ఎవరూ లేరు. దీంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరుకు చేరిన ఆటో ప్రమాద మృతులు

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మహేష్ మృతి



మహేష్(ఫైల్)

అర్వపల్లి / సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 12 : సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలో ఈ నెల 4వ తేదీన ఆగి ఉన్న లారీని ఆటో వెనక నుంచి ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందగా, రోజుల వ్యవధిలో చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కప్పసాటి మహేష్(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కాగా మహేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మోతె, ఏప్రిల్ 12: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన వీరబోయిన బక్కయ్య వీరబోయిన మల్లయ్య, వీరబోయిన మనోజ్‌లు గ్రామం నుంచి బైక్‌పై పాలేరు సంతకు వెళ్తున్నారు. మామిళ్లగూడెం గ్రామశివారులో రైతువేదిక వద్ద నుంచి ఫ్లైఓవర్ పైకి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి పడి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

మోత్కూరు మండలంలో



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అజీద్

మోత్కూరు : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండగడప, పాటిమట్ల గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పాటిమట్ల గ్రామంలోని కాశవాడకు చెందిన షేక్ అజీద్ స్కూటర్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన అజీద్‌ను 108వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ రంజిత్, పైలెట్ శంకర్ తెలిపారు. కారు చౌటుప్పల్ మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందినదిగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై ఆగ్రహం

- జాయింట్ కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
- నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఘటన



కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి గ్రామంలో ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేస్తున్న రైతులు

కనగల్, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీ.ఎడవల్లి రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ధాన్యం ట్రాక్టర్లతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు కానుగు భూపతి మాట్లాడుతూ ఐకేపీ కేంద్రం నిర్వాహకులు వడ్ల కొనుగోలులో సీరియల్‌ను పాటించటం లేదని, ఓ పార్టీ నాయకుల సూచన మేరకు పని చేస్తూ తమ ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 15 రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకురాగా తమకంటే వెనుక తీసుకువచ్చిన రైతుల ధాన్యం రాశులను కాంటా వేస్తున్నారన్నారు. కేంద్రంలో రోజుల తరబడి కాంటాల కోసం ఎదురుచూసి చివరకు ఇతర కేంద్రాలకు వడ్లను తీసుకెళుతున్నట్టు వాపోయారు. ఐకేపీ కేంద్రం నిర్వాహకుల తీరుపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రైతుల ఆందోళనతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. రైతులు చేస్తున్న ఆరోపణలపై మండల మహిళా సమాఖ్య కార్యాలయ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ హరిని వివరణ కోరగా క్రితంసారి సెంటర్‌ను నడిపిన పీఏసీఎస్ అధికారులు సీరియల్ బుక్‌ను సకాలంలో అందించకపోవటంతో కొద్దిపాటి ఆలస్యమైందన్నారు. శుక్రవారం రాత్రి రాస్తారోకో చేసిన సదరు 9మంది రైతుల వడ్లకు కాంటాకు సీరియల్ ఉందని, ఈలోగానే వారు సెంటర్ నుంచి వడ్లను ఇతర సెంటర్లకు తీసుకువెళ్లారని తెలిపారు. ఐకేపీ నిర్వాహకులపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు.

చేనేత కార్మికులకు శుభవార్త!

- నేత కార్మికులకు అండగా 'నేతన్న భరోసా' పథకం
- కొత్త విధానానికి సర్కారు కసరత్తు
- త్వరలో ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహకం



భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 12 : ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేత కార్మికులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' కార్యక్రమాన్ని త్వరలో అమలు చేయనుంది. చేనేతల దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్డర్లన్నీ 'టెస్కో' ద్వారానే కొనసాగించాలని నిర్ణయించింది. చేనేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు త్వరలో 'నేతన్న భరోసా' కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ పథకంతో చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమానికి తాత్కాలిక ప్రయోజనం కన్నా దీర్ఘకాలిక లబ్ధి చేకూరేలా ఈ విధానాన్ని తీసుకు రానున్నారు. ఏడాది మొత్తం పని ఉండేలా రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు, హ్యాండ్లూమ్ పార్కు పునరుద్ధరణ, కొత్త పవర్‌లూమ్ క్లస్టర్ల అభివృద్ధి, మైక్రో హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు, నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ల ఏర్పాటు, స్టేట్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ పాలసీ తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. నేతన్నల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాలను అనుసంధానం చేయడంతోపాటు రావాల్సిన బకాయిలను తెచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ అధికారి తెలిపారు.

చేనేత వస్త్రాల కొనుగోలు ప్రక్రియ 'టెస్కో' ద్వారానే ..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ.8.81 కోట్ల బకాయిలను విడుదల చేసిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మ్యాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించిన బీఆర్ఎస్ సర్కారు విధానాలతో అసలైన కార్మికులకు లబ్ధి చేకూరలేదని, వ్యాపారులు, దళారుల జోక్యం మితిమీరిందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 393 చేనేత సహకార సంఘాలు ఉంటే, కేవలం 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పనికల్పించినట్లు ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వెల్లడైంది. ఇందుకు భిన్నంగా అన్ని చేనేత సహకార సంఘాలకు పని కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.53 కోట్ల వస్త్రాలు కొనుగోలు చేసి, గతంలో చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ. 8.81కోట్ల బకాయిలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి 11వ తేదీ జీవో 1ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తూ టెస్కో ద్వారానే అన్ని ప్రభుత్వ శాఖలు వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీంతో టెస్కోలో లభ్యంకాని వస్త్రాలకు నాన్ ఎవైలబులిటీ సర్టిఫికేట్ ఇస్తే తప్ప, ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉండదు. ఈ మేరకు ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు వస్త్రాల సరఫరా కోసం టెస్కోకు రూ.255.27 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చినట్లు సమాచారం.

చేనేత సంఘాలకు నూతన జవసత్వాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలకు 'నేతన్న భరోసా' పథకంతో మళ్లీ నూతన జవసత్వాలు కలుగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు 'టెస్కో' ద్వారానే వస్త్రాల కొనుగోళ్లు చేయాలని భావిస్తుండటంతో చేనేత సహకార సంఘాలకు పూర్వవైభవం సంతరించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిపై 32 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. చేనేత గిట్టుబాటు కాక పసలు రకాల పనులు చేస్తూ పొట్టపోసుకుంటున్న కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి. గుమస్తాలుగా, రోజు వారి కూలీలుగా, సెక్యూరిటీలుగా, సైకిళ్లపై తిరిగి వస్త్రాలు విక్రయిస్తూ భారంగా జీవనం సాగిస్తున్నారు. భీవండి, షోలాపూర్, సూరత్, అహ్మదాబాద్‌లకు వలస వెళ్లి అక్కడి మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న చేనేత పథకాల వల్ల తమకు లబ్ధి కలిగే అవకాశం ఉందని చేనేత కార్మికులు ఆవాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించనున్న 'నేతన్న భరోసా' వల్ల చేనేత కార్మికుల దశాబ్దాల కల సాకారం కానుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నీటి ఎద్దడి ఛాయలు

- పవర్ బోర్లే ఆధారం
- డిమాండ్‌లో సగమే సరఫరా చేస్తున్న హెచ్‌ఎం డబ్ల్యూఎస్
- మూడు రోజులకోసారి కృష్ణా జలాలు..
- రోజు విడిచి రోజు స్థానిక జలాల సరఫరా



భువనగిరి టౌన్, ఏప్రిల్, 12: జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో క్రమేపీ తాగునీటి ఎద్దడి ఛాయలు అలుముకుంటున్నాయి. ఇప్పటికిప్పుడు సమస్య తీవ్రత లేనప్పటికీ వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మాత్రం పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పకపోవచ్చు. పట్టణంలోని 35 వార్డుల్లో 77,294 మంది నివసిస్తున్నారు. మునిసిపల్ నిబంధనల ప్రకారం ప్రతీరోజు ఒక్కక్కరికి 135 లీటర్ల నీరు నల్లాల ద్వారా సరఫరా జరగాల్సి ఉంటుంది. ఈ మేరకు పట్టణంలోని సుమారు 10,341 నల్లాలు, ట్యాంకర్ల ద్వారా రోజువారీగా 10.43 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా కావల్సి ఉంది. కానీ భువనగిరి పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్‌ఎం డబ్ల్యూఎస్) నుంచి ప్రతీరోజు కేవలం 5 ఎంఎల్‌డీ గోదావరి జలాలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. దీంతో ప్రజల అవసరాలను తీర్చేందుకు మునిసిపల్ యాంత్రాంగం 122 పవర్ బోర్ల ద్వారా రోజుకు 5.87 ఎంఎల్‌డీ, మూడు విలీన గ్రామాలలో స్థానిక వనరుల ఆధారంగా మరో 0.44 ఎంఎల్‌డి జలాలను సరఫరా చేస్తున్నారు. మూడు రోజులకోసారి గోదావరి, రోజు విడిచి రోజు స్థానిక జలాలు వేరువేరు పైప్ లైన్లద్వారా సరఫరా జరుగుతోంది. పైప్‌లేన్ లేని ఇందిరమ్మ, నందగిరి తదితర కాలనీలో మూడు వ్యవసాయ బావుల మోటార్ల నుంచి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. హెచ్‌ఎం డబ్ల్యూఎస్ గోదావరి జలాల సరఫరాలో ఏ మాత్రం అవాంతరం ఏర్పడినా పట్టణవాసులు తాగునీటికి అల్లాడాల్సిన పరిస్థితి వస్తుంది. తాగునీటి చట్టం ప్రకారం పట్టణంలోని పబ్లిక్ నల్లాలన్నింటినీ నాలుగేళ్ల క్రితమే మునిసిపల్ యంత్రాంగం తొలగించింది. రికార్డుల ప్రకారం 34 చేతి పంపుల ఉన్నప్పటికీ పనిచేయనివే అధికంగా ఉండటం గమనార్హం.

అప్రమత్తంగానే ఉన్నాం



పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు మునిసిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నది. ఇప్పటివరకు పట్టణంలో తాగునీటి కష్టాలు లేవు. తాగునీటి సమస్య నివారణకు తగినన్ని నిధులు కేటాయించాం. ఈ మేరకు బోరు బావుల ఫ్లెషింగ్ తదితర పనులను చేపట్టాం. బస్తీల్లో తాగునీటి ఇబ్బందు లు ఎదురైతే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398915335కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నాం.

- రామాంజూల్‌రెడ్డి, కమీషనర్, భువనగిరి మున్సిపాలిటీ

యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో..

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో ఇప్పటి వరకు నీటి సమస్య రాలేదు. మునిసిపాలిటిలో సుమారు 4600 ఇళ్లు ఉండగా అందులో 3600ఇళ్లకు ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిగతా వాటికి సొంత బోర్లు ఉన్నాయి. పబ్లిక్ నల్లాలు సుమారు 60వరకు ఉన్నాయి. గుట్టకు ప్రతీ రోజు 15లక్షల వరకు మిషన్‌భగీరథ నీరు రావాల్సి ఉండగా రోజుకు 8, 9లక్షల నీరు మాత్రమే వస్తోంది. గుట్ట మునిసిపాలిటీకి సొంత బోర్లు 45ఉండగా మరో మూడు బోరు బావులు అద్దెకు తీసుకుని 12 వార్డుల్లో ప్రతీ రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. మునిసిపాలిటీకి మూడు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. భవిష్యత్తులో నీటి సమస్య ఉత్పన్నం అయితే మరిన్ని అద్దెబోర్లు తీసుకుని వార్డుల వారీగా రోజు తప్పి రోజు సరఫరా చేసే అవకాశం ఉంది.

నరేంద్రమోదీ తోనే 'త్రీడీ'లు సాధ్యం

● మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

భూదాన్‌పోచంపల్లి/ చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్/ సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 12: ఏప్రిల్ 12: నరేంద్రమోదీ తోనే 'త్రీడీ'లు దేశం- ధర్మం-డెవలప్‌మెంట్ సాధ్యమవుతుందని, కులవృత్తులను కార్పొరేట్ చేయడమే బీజేపీ లక్ష్యమని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో బీజేపీ చేనేత భరోసా యాత్రను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేనేత మగ్గాలను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత ప్రతినిధులతో కలిసి సమస్యలపై చర్చించారు. బీజేపీ చేనేత సెల్ మండల కన్వీనర్ గంజి బస్వలింగం అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన డాక్టర్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ పోచంపల్లికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చే విధంగా ఐరాస ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక చేసి అవార్డు సాధించిన ఘనత బీజేపీదేనన్నారు. చేనేతకు ప్రత్యేకంగా ఒకరోజు ఉండాలని చేనేత దినోత్సవాన్ని ప్రకటించిన ఘనత కూడా బీజేపీదేనన్నారు. గత బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేనేత కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా వారి జీవితాలతో ఆడుకున్నాయని అన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన తాను చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించానని అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మరో నేత బజార్‌ను ఏర్పాటుచేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. పోచంపల్లిలో నేత బజార్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఏలె భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, కర్నాటి ధనుంజయ, పోతంశెట్టి రవీందర్, దోనూరి రాంరెడ్డి, డీఎల్ నారాయణ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, బీజేపీ కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, చేనేత సెల్ మండల కన్వీనర్ గంజి కృష్ణ, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు డి సాయేషకుమార్, మండల అధ్యక్షుడు రాజుయాదవ్, నాయకులు భైరు వెంకటేష్‌గౌడ్, చింతల రామకృష్ణ, కొంతం శంకర్‌గౌడ్, కేసారం కృష్ణారెడ్డి, ఏలె శ్రీనివాస్ పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో నేతన్న విగ్రహానికి పూలమాలవేసి నినదిస్తున్న బూర నర్సయ్యగౌడ్

● చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయనగర్‌లో నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి చేనేత కార్మికులకు అనేక సబ్సిడీ పథకాలను తెప్పిస్తానని బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. సమావేశంలో నాయకులు దోనూరు వీరారెడ్డి, డి.లక్ష్మీనారాయణ, దూడల బిక్షం, రమనగోని శంకర్, కౌన్సిలర్ పి.శ్రీధర్‌బాబు, జి. సురేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు. మం డల పరిధిలోని కొయ్యలగూడెంలో చేనేత భరోసా యాత్ర నిర్వహించారు. నాయకులు దూడల బిక్షంగౌడ్, చినుకని మల్లేషం, బాతరాజు సత్యం, గడ్డం నర్సింహ ఉన్నారు.

● సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం, పుట్టపాక గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలో చేనేత భరోసా యాత్ర నిర్వహించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ సహకారంతో కార్మికుల సమస్యలను అంచెలంచెలు ఎగా పరిష్కరిస్తుందని బూర హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు దోనూరు వీరారెడ్డి, సుర్వీరాజుగౌడ్, వంగరి రఘు, సూరేపల్లి జనార్దన్, జవహర్, చెరుపల్లి లక్ష్మయ్య, విడం వెంకటేశం, చిలుకూరి శ్రీను, ఏలె నరసింహ, సోలాపురం నారాయణ, సింగం బిక్షపతి, భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల దోస్తీ: బూర

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. చౌటుప్పల్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ తెరచాటు స్నేహితులు అని, రెండింటి మధ్య లవ్ యాంగిల్ నడుస్తోందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ దోచుకున్న దాంట్లో.. తమకు ఇంత ఇవ్వండి.. తాము దాచుకుంటామని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌కు కండీషన్ పెట్టారని ఆయన అన్నారు. ప్రభుత్వానికి మిల్లర్లు బకాయి పడిన రూ.90 నుంచి 120కోట్లను మాఫీ చేయించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మంత్రి రూ.20 నుంచి 30 కోట్లు కప్పం వలె తీసుకొని మాఫీ ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారం ఉందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ కష్టాలు తెచ్చే పార్టీ అని, రాష్ట్రంలో కాంగ్రెస్ రాగానే కరువు వచ్చిందని, బోరు బావులు, రైతుల పొలాలు ఎండిపోయాయని, అవినీతి పెరిగిపోయిందని అన్నారు.



చౌటుప్పల్‌టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి గురించి మరిచిపోయారని, బాహుబలి మోటార్ల వైపే చూడడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబద్ లో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ సంస్థల నుంచి ఆర్ ట్యాక్స్ అంటే రేవంత్ రెడ్డి ట్యాక్స్ ను వసూలు చేస్తున్నారన్న వినికిడి ఉందని ఆయన అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దోనూరు వీరారెడ్డి, దాసరి మల్లేశం, ధనుంజయ్య పాల్గొన్నారు.

'దళితులపై వివక్ష చూపుతున్న బీజేపీ'

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 12: అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం దళితులపై వివక్ష చూపుతోందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశపాక దయాకర్, ఏర్రోల్ల లింగస్వామి ఆరోపించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం మండల స్థాయి సమావేశం మీసాల దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు 400 సీట్లు వస్తాయని అప్పుడు రాజ్యాంగాన్ని మార్చుకోవచ్చునని బీజేపీ ప్రభుత్వం విర్రవీగుతోందని అన్నారు. దళితులు అంతా ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు పాల్గొన్నారు. అనంతరం ఆ సంఘం నూతన కమిటిని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్లుగా మీసాల దాసు, బోద సాయిలు, కో కన్వీనర్లుగా మద్దురా భాగ్యమ్మ, ఎన్.కిష్టమ్మను నియమించారు.

వెంకటాపురంలో రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వలిగొండ, ఏప్రిల్ 12: మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి గుట్టపైన వెలసిన పార్వతీ సమేత పంచముఖ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో గణపతి పూజ, పుణ్యాహవానం, పంచ గవ్యం, గోపూజా అఖండ దీపారాధన, దీక్షా తక్షణ, మండపారాధన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి మోత్కూరులో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు

మోత్కూరు, ఏప్రిల్ 12: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి-కొండాపురం గ్రామాల మధ్య ఉన్న రాముని బండపై ఈ నెల 13 నుంచి 17 వరకు శ్రీసీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు మునిసిపల్ కౌన్సిలర్ దబ్బెటి విజయరమేష్, ఆలయ కమిటి ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాల కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. 13న సీతారామ, లక్ష్మణ, హనుమాన్, వశిష్ఠ మహర్షి విగ్రహాలు, జయ స్తంభం ఊరేగింపు, 14న యాగశాల ప్రవేశం, హోమాలు, 15న విగ్రహాల ప్రతిష్ఠ, జయస్తంభం ప్రతిష్ఠ, 17న సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17 న నిర్వహించే సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

జై భీమ్ యాత్రను విజయవంతం చేద్దాం: ప్రమోద్‌కుమార్

భువనగిరి రూరల్, ఏప్రిల్ 12: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న నిర్వహిస్తున్న జై భీమ్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ కోరారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండి భీమ్ యాత్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొనకొండ వనితరాములు, కౌన్సిలర్లు ఈరపాక నర్సింహ, నాయకులు ఎండి.ఇమ్రాన్, సురుపంగ శివలింగం, ఇటికాల దేవేందర్, శివశంకర్, ప్రమీల, కర్తల శ్రీనివాస్, జయ ఉన్నారు.

యూత్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నాగరాజు

మోత్కూరు, ఏప్రిల్ 12: మోత్కూరు మండలం దాచారం గ్రామంలో జైభీమ్ యూత్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సూరారం నాగయ్య, సూరారం సైదులు, అధ్యక్షుడిగా పులిగిల్ల నాగరాజు, ఉపాధ్యక్షుడిఇగా గోలి నవీన్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా తాటిపాముల మహేందర్, సహాయ కార్యదర్శిగా సూరారం అశోక్, కోశాధికారిగా సూరారం నవీన్, ప్రచార కార్యదర్శులుగా సూరారం అరుణ్, పొట్టపాక అశోక్, సలహాదారులుగా మహేందర్, సైదులుతో పాటు మరో 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 12: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీ పథకాలను అంచెలవారీగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడిపిస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం గుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బొమ్మలరామారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామిరెడ్డి, చౌదరుపల్లి యాదవ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్, మెట్ల నవీన్, శ్రీనివాస్‌గౌడ్, నిర్మల ఎల్లారెడ్డి, ఫకీర్, రామిడి సంజీవ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి పార్టీకి ఆకర్షితులైన ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, బిట్టు సరోజహరీష్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

భువనగిరిలో గెలిచేది కాంగ్రెస్సే : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

భువనగిరి టౌన్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మరోసారి గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలోని ఓ హోటల్‌లో తనను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యతను అందరూ నాయకులు కార్యకర్తలు స్వీకరించాలన్నారు. రాష్ట్రంలో సాగుతున్న ప్రజా రంజక పాలనకు తోడు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఉత్సాహంతో భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నరసింహ, నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, పడిగెల ప్రదీప్, పిట్టల బాలరాజ్, పుట్ట గిరిష్, కుమార్‌గౌడ్, గ్యాస్ చిన్న పాల్గొన్నారు.



భువనగిరిలో కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

హక్కులకోసం పోరాడే వారిని ఆదరించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సింహ

భువనగిరి రూరల్, ఏప్రిల్ 12: నిరంతరం ప్రజల తరపున నిలబడుతూ హక్కుల కోసం పోరాడే వారినే ఆదరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ కోరారు. శుక్రవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్ తరపున నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బూటపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దన్నారు. అదే విధంగా ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకున్న బీఆర్ఎస్‌కు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని, మతోన్మాద బీజేపీని ఓడించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19న జిల్లా కేంద్రంలో సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్, నామినేషన్ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు దయ్యాల నర్సింహ, కొండ అశోక్, కూకుట్ల కృష్ణ, మల్లయ్య, హైమావతి, చొక్క కుమారి ఉన్నారు.



వలిగొండ: పులిగిల్లలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ: కార్మికుల కోసం రైతుల కోసం వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే పేదల అభ్యర్థి ఎండి జహంగీర్‌ను ఆదరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజుగౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల, కార్మికుల, కూలీల పక్షాన పోరాడే సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మద్దతు ధర అందించలేకపోయారని, మరోవైపు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి రైతులకు కూలీలుగా కార్మికులుగా మార్చాలన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పోరేట్ వాళ్లకు అప్పజెప్పి కార్మికులకు వారి సమస్యలపై పోరాడే హక్కులను తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగ స్వామి నాయకులు భిక్షపతి, వెంకటయ్య, అమరేందర్, రాములు, ముత్తయ్య, యాదగిరి, నాగరాజు, మధు, విజయ్, జ్యోతిబసు, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

మోత్కూరు : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించి పార్లమెంటుకు పంపాలని పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. శుక్రవారం మండంలోని ముశిపట్లలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులతో గెలుపొందాలనుకుంటున్న రాజకీయనాయకులను ప్రజలు ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పాటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కమిటి సభ్యులు పైళ్ల రాంరెడ్డి, సబిత, సరిత, దడిపెల్లి ప్రభాకర్, కొంపెల్లి గంగయ్య పాల్గొన్నారు.



మోత్కూరు: ముశిపట్లలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి వెంకటనర్సు

గ్రామాభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 12: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని నాగిరెడ్డిపల్లి గ్రామస్థులకు కోరారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిశారు. గ్రామంలో సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాలువలు, మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం స్పందిస్తూ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్య లను విడతల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు సుక్క అశోక్, రావి అశోక్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, సాయి ఉన్నారు.

యువ ఓటర్లు లక్ష్యంగా ప్రచారం: బీజేవైఎం

భువనగిరి టౌన్, ఏప్రిల్ 12: ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి గెలిపించేందుకు యువ ఓటర్లు లక్ష్యంగా బీజేవైఎం కార్యకర్తలు ఎన్నిక చేయాలని జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ అన్నారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన బీజేవైఎం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తరుణ్‌రెడ్డి, దిండు భాస్కర్, దయ్యాల కుమారస్వామి, బూరుగు మణికంఠ పాల్గొన్నారు.

నేడు భువనగిరిలో సమాచార హక్కు చట్టం సదస్సు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 12: భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం సమాచారహక్కు చట్టం సదస్సు నిర్వహిస్తున్నట్టు సమాచారహక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవా సదనం స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షీద్‌పాషా తెలిపారు. శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, చీఫ్ రిటైర్డ్ ఇంజనీర్ ఎంఏ.ఖరీం, హైకోర్టు అడ్వకేట్, ఆజాద్ హింద్ ఫౌజ్ జాతీయ అధ్యక్షుడు ఎంఏ.ముజీబ్ ముఖ్య అతిథులుగా రానున్నట్టు తెలిపారు. ఆర్టీఐ కార్యకర్తలు, పారదర్శకత పాలనను ఆశించే వారందరూ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

బీజేవైఎం మండల కమిటీ ఎన్నిక

సంస్థాన్ నారాయణపురం ఏప్రిల్ 12 : భారతీయ జనతా యువమోర్చా మండల పూర్తిస్థాయి కమిటీని శుక్రవారం యూత్ మండల అధ్యక్షుడు ఉష్కాగుల గిరిబాబు ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా జక్కర్తి గణేష్, గోల్లూరు సాయి, గండూరి అంబర్నాథ్ , మొగుదాల సురేష్, సుర్వి వినయ్, ప్రధాన కార్యదర్శులుగా గూడూరు మంజునాథరెడ్డి, కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శులుగా గంట జ్యోతిరాజు, చిలువేరు రాజు, అంగోతు రాజేందర్, బాలం శంకర్, నకిరేకంటి సుధాకర్, కోశాధికారిగా ఉప్పల నరేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా గుండు నవీన్, కార్యవర్గ సభ్యులుగా జనిగల కిరణ్, చిలువేరు ప్రసాద్, రాపర్తి నవనీత్, కోగూరు గురునాథ్, వెలిజాల శ్రీకాంత్ మారసాని సాయి, పందుల మహేష్, నూకం వంశీ, నీళ్ల సురేష్‌లు ఎన్నికయ్యారు.

బీజేవైఎం జిల్లా కోశాధికారిగా చైతన్యగౌడ్

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 12: బీజేవైఎం జిల్లా కోశాధికారిగా యాదగిరిపల్లికి చెందిన ఎరుకల చైతన్యగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ యాదగిరికి నియామక పత్రాన్ని అందజేశారు.

ఉద్యమకారుల జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా వెంకటేశం

వలిగొండ, ఏప్రిల్ 12: మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన మల్లం వెంకటేశం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయనకు నియామక పత్రాన్ని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి కృష్ణహర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అంజయ్య, శ్రీనివాస్‌గౌడ్, స్వామి, సుదర్శన్, శ్రీనివాసచారి స్వామి పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డికి సన్మానం

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 12: డీసీవోతో సస్పెండ్‌కు గురై ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలతో తిరిగి చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన చింతల దామోదర్ రెడ్డి ని శుక్రవారం భవానీ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వి.రాజేందర్, వి.మహేందర్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, రామాలయం మాజీ చైర్మన్ డి. గోవర్ధన్ రెడ్డి, దాడి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

గుండాల, ఏప్రిల్ 12: గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అండెం మాధవరెడ్డి ఇటీవల పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణపై ఆయనను డీఈవో నారాయణ రెడ్డి సస్పెండ్ చేశారు. మాధవరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు డిమాండ్ చేసిన విషయం విదితమే. ఈమేరకు మాధవరెడ్డిని సస్పెండ్ చేసినట్లు శుక్రవారం డీఈవోనుంచి ఉత్తర్వులు అందాయని ఎంఈవో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.